


17లోగా టెన్త్ సప్లిమెంటరీ ఫీజు చెల్లింపు

ప్రజాశక్తి - పార్వతీపురం

అడ్వాన్స్‌డ్ ఎస్ఎస్‌సి, ఒఎస్ఎస్‌సి సప్లిమెంటరీ పరీక్షలకు విద్యార్థులు ఈనెల 17లోగా ఫీజులు చెల్లించాలని డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన జారీ చేశారు. మే 7 నుంచి 17 వరకు ఫీజులు చెల్లించేందుకు గడువు ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. రూ.50 అపరాధ రుసుంతో మే 18 నుంచి 22 వరకు చెల్లించవచ్చన్నారు. ఫీజులను www.bse.ap.gov.in వెబ్సైటు ద్వారా పాఠశాల లాగిన్ నుంచి చెల్లించాలని చెప్పారు. సి.ఎఫ్.ఎం.ఎస్, బ్యాంకుల్లో చెల్లించిన చలానాలు స్వీకరిస్తున్నట్టు వివరించారు. మూడు సబ్జెక్టుల వరకు రూ.110 ఫీజు, మూడు సబ్జెక్టుల కంటే ఎక్కువ ఉంటే రూ.125 ఫీజు చెల్లించాలని ఆయన చెప్పారు. ప్రధాన ఉపాధ్యాయులకు గతంలో ఇచ్చిన యూజర్ ఐడి, పాస్ వర్డ్ లతో లాగిన్ కావాలని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులు గమనించి తక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

రాజన్నదొర అంగీకారంతోనే అక్కడ గిరిజన యూనివర్సిటీ

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి - సాలూరు

విజయనగరం జిల్లా మెంటాడ మండలంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొర అంగీకారంతోనే జరిగిందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. బుధవారం డిప్యూటీ సిఎం రాజన్నదొర నివాసంలో ఆయనకు రాజన్నదొరతో పాటు అర్బన బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి స్వాగతం పలికారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలంటే రోడ్డు కనెక్టివిటీ, ఇతర సౌకర్యాలు అనుకూలంగా వుండాలన్నారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి సిఎంగా ఉన్న సమయంలో బాసరలో ఐఐటి ఏర్పాటు చేయాలని భావించారని అన్నారు. ప్రొఫెసర్ల రాకపోకలకు అనువుగా లేదని అక్కడ కాకుండా రంగారెడ్డి జిల్లాలో ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. టిడిపి ప్రభుత్వ హయాంలో గిరిజన యూనివర్సిటీ పాచిపెంటలో ఏర్పాటు చేస్తామని ఊరించి కొత్తవలసకు తీసుకెళ్లారని, వైసిపి ప్రభుత్వం కూడా అదే చేసిందని 'ప్రజాశక్తి' ప్రస్తావించగా మంత్రి బొత్స సత్యనారాయణ పై సమాధానం ఇచ్చారు. సాలూరు, రామభద్రపురం మండలాల సరిహద్దులోనూ గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు స్థలపరిశీలన చేశారని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా మెంటాడ మండలంలో సరిపడినంత భూమి లభించిందని, మంత్రి రాజన్నదొర అంగీకారంతోనే జరిగిందని చెప్పారు. మున్సిపాలిటీలో రూ.6.5కోట్ల నిధులతో


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ, పక్కన రాజన్నదొర

పనులు జరగడం లేదని, బిల్లులు సకాలంలో మంజూరు కావడం లేదని కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని చెప్పగా వెంటనే కమిషనర్ హెచ్.శంకరరావును పిలిపించి మాట్లాడారు. ఒక్కో వర్క్ పదిసార్లుకు పైగా టెండర్ పిలిచినా కాంట్రాక్టర్లు సుముఖంగా లేరని చెప్పగా పనులన్నీ డిసెంబర్‌లోగా జరగాలని ఆదేశించారు. మున్సిపాలిటీలో బిల్లులు పెండింగులో లేనప్పుడు కాంట్రాక్టర్లు ఎందుకు చేయరని, వారు చేయకపోతే వర్కుల్ని ప్యాకేజీ కింద టెండర్ పిలిచి కొత్త కాంట్రాక్టరుతో పూర్తి చేయాలని ఆదేశించారు. మండలంలోని శివరాంపురం వంతెన నిర్మాణం అసంపూర్తిగా వుందని చెప్పగా, పంచాయతీ రాజ్ ఎస్ఇతో ఫోన్‌లో మాట్లాడి పని పూర్తయ్యేలా చూడాలని మంత్రి బొత్స ఆదేశించారు.

వైసిపి నాయకులకు బొత్స పరామర్శ

మండలానికి చెందిన పలువురు సీనియర్ వైసిపి నాయకులను విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ బుధవారం పరిశీలించారు. మామిడిపల్లిలో మాజీ వైస్ ఎంపిపి సువ్వాడ తవుడు విగ్రహావిష్కరణకు హాజరైన బొత్స డిప్యూటీ సీఎం రాజన్నదొరతో కలిసి సీనియర్ వైసిపి నాయకులు రెడ్డి తిరుపతి నాయుడు స్వగ్రామం బాగువలస వెళ్లి ఆయన్ను పరామర్శించారు. గత కొంతకాలంగా రెడ్డి తిరుపతి నాయుడు వృద్ధాప్యం కారణంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ రెడ్డి పద్మావతి, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, మండల సచివాలయాల కన్వీనర్ కె.త్రినాధనాయుడు వున్నారు. అంతకుముందు మామిడిపల్లి గ్రామంలో వైస్ ఎంపిపి సువ్వాడ గుణవతి నివాసానికి వెళ్లి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వైసిపి మండల మాజీ అధ్యక్షులు సువ్వాడ రమణతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. వైసిపి నాయకులు సువ్వాడ భరత్ శ్రీనివాస్, ఇతర కుటుంబ సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు.

ప్రజలు సంతృప్తి చెందేలా అర్జీల పరిష్కారం

కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి - కలెక్టరేట్

'జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారం అర్జీదారు సంతృప్తి, సంతోషపడేలా పరిష్కరించుటకు చర్యలు తీసుకుంటామని కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరు కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 52 శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను ఒకే వేదిక నుంచి పర్యవేక్షించి పరిష్కారం చూపనున్నారని, జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని జిల్లాలో పటిష్టంగా నిర్వహించేందుకు అన్ని చర్యలూ చేపట్టామని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారానికి నాలుగు అంచెల విధానం అమలు చేయనున్నట్లు తెలిపారు. అర్జీ నమోదు, విచారణ, సకాలంలో స్పందన, అర్జీదారు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపించుట అనే విధానం అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి అర్జీకి వైఎస్ఆర్ నెంబరు కేటాయిస్తారని, అర్జీదారునికి మెసేజ్ ద్వారా సమాచారం వస్తుందని, మెసెజ్‌లో గల నెంబరు ద్వారా అర్జీ స్థితిని తెలుసుకోవచ్చునని తెలిపారు. జిల్లాలో రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖ, వ్యవసాయ శాఖ, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖలతో కలిసి ఆడిట్ బృందాన్ని, ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేశామన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ముఖ్యమంత్రి స్థాయిలో పర్యవేక్షణ జరగడం, కార్యక్రమం ప్రాధాన్యతను అందరికీ


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

వివరించినట్టు తెలిపారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ఆరు నెలల ముందు నుండే రాష్ట్ర స్థాయిలో చక్కగా రూపకల్పన చేశారని, సమస్యల పరిష్కారానికి ఎస్ఒపి రూపకల్పన, జిల్లాలకు ప్రత్యేక అధికారి నియమించినట్లు తెలిపారు. జిల్లాలో ప్రతి మారుమూల గ్రామానికి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునే ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఏ మండలాల్లో ఎక్కువ అర్జీలు అందుతున్నాయి, అందుకు కారణాలు విశ్లేషిస్తున్నామని చెప్పారు. వీటిని విశ్లేషించి మార్గదర్శకంగా ఉండుటకు "రెడీ రెకనర్" ను కేస్ స్టడీలతో రూపొందిస్తున్నామని, సమస్య పరిష్కారానికి చక్కగా ఉపయోగపడు తుందని విశ్వసిస్తున్నామని అన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులను పరిష్కరించడమే ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశ్యమని జిల్లా కలెక్టర్ తెలిపారు.

అర్జీదారులకు పరిష్కారం చూపేలా 'జగనన్నకు చెబుదాం'

అడిషనల్ సి.సి.ఎల్.ఎ. ఇంతియాజ్ జాయింటు కలెక్టర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్నకు చెబుదాం, స్పందన, భూమిలేని పేదవారికి భూపంపిణీ, షెడ్యూలు కులాలవారికి శ్మశానవాటికలకు స్థలాలు గుర్తింపు, ఎపిఐఐసి భూముల మ్యుటేషన్, వాటర్ టాక్స్, ఒన్ టైమ్ కన్వర్షేషన్ టాక్స్, మ్యుటేషన్స్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ సిసిఎల్ఎ ఇంతియాజ్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రవేశపెట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలను అర్జీదారునితో మాట్లాడి సరైన పరిష్కారం చూపాలని, పరిష్కారం అర్జీదారు సంతృప్తి పడేలా ఉండాలని, అర్జీ మళ్లీ తెరవకూడదని తెలిపారు. ఎపిఐఐసికి కేటాయించిన భూములను మ్యుటేషన్ చేయాలన్నారు. భూములకు సంబంధించిన మ్యుటేషన్లు సకాలంలో పూర్తిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి జాయింటు కలెక్టరు సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శరవేగంగా పనులు పూర్తి చేయండి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన సంక్షేమ శాఖ, పంచాయతీ రాజ్, నీటి సరఫరా విభాగం, విద్యుత్ శాఖ ఇంజనీరింగ్ ఆధ్వర్యాన చేపడుతున్న అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయాలని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం తన కార్యాలయంలో సంబంధితశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ నాడు-నేడు పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే నాటికి అన్ని పనులు పూర్తి కావాలన్నారు. మెలియాపుట్టి మండలంలోని చందనగిరి, కేరాసింగి, హడ్డివాడ రోడ్లను త్వరితగతిన పూర్తి చేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. సిసిడిపి నిధులతో చేపడుతున్న పనులపై సమీక్ష నిర్వహించారు. నీటి సరఫరా విభాగం అధికారులతో మాట్లాడుతూ ప్రతి గ్రామానికి తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కొళాయి సదుపాయం కల్పించాలన్నారు. దూర ప్రాంతాల నుంచి నీరు తెచ్చుకొనే గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వేసవిలో ఎటువంటి తాగునీటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న ఐటిడిఎ పిఒ కల్పనకుమారి

మొగదరగూడ, లోతుగూడ, తాలాడ గ్రామాల్లో చేపడుతున్న పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ అధికారులతో మాట్లాడుతూ ప్రస్తుతం చేపడుతున్న రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలపై దృష్టి సారించాలని అన్నారు. సమావేశంలో ఇఎన్‌సి సబ్బం శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ప్రభాకరరావు, ఇఇ మురళి, పంచాయతీరాజ్ ఇఇ రాధారాణి, ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

భవనాలు పరిశీలన

మండలంలోని హడ్డుబంగి బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల అదన భవనం పనులను గిరిజన సంక్షేమ చీఫ్ ఇంజనీర్ ఎస్.శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. జూన్ నాటికి మెళియాపుట్టి, భామిని ఏకలవ్య పాఠశాలల నిర్మాణాలు పూర్తవుతాయని, భవనాలు ఇస్తామని తెలిపారు. అలాగే పాలకొండ, శ్రీకాకుళం ఆశ్రమ పాఠశాల అదన భవనం నిర్మాణానికి స్థల సమస్య ఉందని, ఈ సమస్య పరిష్కరించాలని పిఒ దృష్టికి చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ తీసుకెళ్లారు. ఆయనతో పాటు ట్రైబల్ వెల్ఫేర్ ఎడ్యుకేట్ ఇంజనీర్ జి.మురళి, డిఇ కృష్ణకుమార్ తదితరులు ఉన్నారు

ఐటిఐలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టీవీ గిరి ప్రకటనలు తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్, మోటర్ వెహికల్, వెల్డర్, కంప్యూటర్ ఆపరేటర్, ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, డ్రెస్ మేకింగ్‌లో సీట్లు భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి గల గిరిజన అభ్యర్థులు iti.ap.gov.in వెబ్ సైట్‌లో ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకున్న అభ్యర్థులు తమ నమోదు యునిక్ నంబర్, అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్లతో తమ దగ్గరలో గల ప్రభుత్వ ఐటిఐలో వెరిఫికేషన్ చేయించుకొని ప్రిన్సిపల్ వారి ద్వారా అప్రోవల్ చేయించుకోవాలన్నారు. అలా చేయబడిన వారి పేర్లు మాత్రమే మెరిట్‌లిస్టులో నమోదవుతాయనానరు. మెరిట్ లిస్టు లో ఉన్నవారికి, వారికి కేటాయించిన తేదీ ప్రకారం కన్వీనర్/ప్రిన్సిపల్, ప్రభుత్వ ఐటిఐ, సాలూరు, పార్వతీపురం మన్యం జిల్లా వారి ద్వారా కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్టు తెలిపారు. నమోదు, అప్రోవల్ చేసుకోవడానికి ఆఖరు జూన్ 6 సాయంత్రం 5గంటల్లో అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 75690 62449, 9948582309 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. వెరిఫికేషన్‌కు 1 నుంచి పదో తరగతి వరకు మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, బదిలీ (టిసి), ఇడబ్ల్యుఎస్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు ఇతర ధ్రువపత్రాలు అందజేయాలన్నారు.


పరీక్షలను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రశాంతంగా పాలిటెక్నిక్ ప్రవేశపరీక్ష

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని ఎమ్మార్ నగరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పరిధిలో 8 కేంద్రాల్లో బుధవారం జరిగిన పాలిసెట్ ఎంట్రన్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ప్రిన్సిపల్ విలియం కేరి తెలిపారు. ఉదయం 11గంటలకు ప్రారంభం కాగా, పరీక్షా కేంద్రాలను కలెక్టర్ నిషాంత్‌కుమార్ కేంద్రాలను సందర్శించి, పరీక్షలు జరుగుతున్న తీరును, కేంద్రాల్లో ఆరోగ్యశిబిరాన్ని, మౌలికసదుపాయాలను పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల బెలగాం, డివిఎం మునిసిపల్ హైస్కూల్, బెలగాం, ప్రభుత్వ పాలిటెక్నిక్, ఎమ్మార్ నగరం, శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల కొత్తవలస, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల బెలగాం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆర్టీసీ కాంప్లెక్స్, కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 1330మంది అభ్యర్థులకు గాను, 1083 మంది పరీక్షకు హాజరుకాగా, 247 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపల్ తెలిపారు. అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయగా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, రూరల్, పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


సాలూరులో స్టాక్‌పాయింట్‌ను పరిశీలిస్తున్న డిఇఒ ప్రేమ్‌కుమార్

బాలికల హైస్కూల్‌ను పరిశీలించిన డిఇఒ

సాలూరు : పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను బుధవారం డిఇఒ నిమ్మక ప్రేమ్‌కుమార్ ఆకస్మికంగా పరిశీలించారు. పాఠశాలలో రెమిడియల్ క్లాస్, నాడు నేడు పనులకు సంబంధించి స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు.

మక్కువ : మండల కేంద్రంలో పాఠశాలలను డిఇఒ ప్రేమ్‌కుమార్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపిపి ఎస్ పాఠశాలలో జగనన్న విద్యా కానుకల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. స్థానిక ఎంఇఒ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎపిఒ శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రానికి బైపాస్ రోడ్డు ప్రతిపాదన

రోడ్డు పనులు పరిశీలించిన డిప్యూటీ సిఎం, కలెక్టర్

ప్రజాశక్తి - సాలూరు

పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంతో పాటు పాలకొండ పట్టణానికి జాతీయ రహదారి అనుసంధానం చేసి బైపాస్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ చెప్పారు. బుధవారం జిల్లా కలెక్టర్‌తో పాటు డిప్యూటీ సిఎం రాజన్నదొర కూడా బైపాస్ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణానికి సంబంధించి 5.9కిలోమీటర్ల బైపాస్ రోడ్డు నిర్మాణం దాదాపు పూర్తయిందని చెప్పారు. ఇది వాడుకలోకి వస్తే పట్టణం మీదుగా వెళ్లే వాహనాల రాకపోకలు తగ్గుతాయని చెప్పారు. దీనివల్ల ట్రాఫిక్ ఇబ్బందులు, రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని చెప్పారు. పార్వతీపరం జిల్లా కేంద్రం, పాలకొండ పట్టణానికి బైపాస్ రోడ్లు మంజూరు చేయాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో జరిగిన


జాతీయ రహదారి పనులపై సమీక్షిస్తున్న రాజన్నదొర, కలెక్టర్

వీడియో కాన్ఫరెన్స్‌లో కోరినట్లు చెప్పారు. ఈ పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, ఆర్‌డిఒ హేమలత, ఎన్ హెచ్ డిఇ నర్సింహారావు వున్నారు.

భవనాలు ప్రారంభించాలి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పూతికవలస పంచాయతీ పరిధిలో గల సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్ నిర్మాణం జరిగి ఏళ్లుగడుస్తున్నా నేటికీ ప్రారంభించక పోవడం ప్రభుత్వం నిర్లక్ష్యం కు నిదర్శనమని సిపిఎం నాయకులు ఎం.తిరుపతి రావు, ఎం. వెంకటేష్, పి. కుమార్ విమర్శించారు. పథకాల ప్రచారం కోసం గడప గడపకు వెళుతున్న ప్రజా ప్రతినిధులు ఈ సమస్య ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. కాంట్రాక్టర్‌కు బకాయి బిల్లులు చెల్లించి ఈ కార్యాలయాలు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.

హాస్టల్‌కు రోడ్డు వేయాలి


హాస్టల్ భవనానికి రోడ్డు వేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తిరుపతిరావు డిమాండ్ చేశారు. సీతంపేటలో 100మందికి పైగా గిరిజన ఐటిఐ విద్యార్థులు ఉంటున్న హాస్టల్ భవనానికి సరియైన రహదారి లేదన్నారు. రహదారిలో లైట్లు పనిచేయడం లేదన్నారు. హాస్టల్ చుట్టూ ప్రహరీ లేదదని, గిరిజనుల అభివృద్ధిని ప్రభుత్వం పట్టించుకోదని విమర్శించారు.

అప్పలనాయుడు జ్ఞాపకాలు మరువలేనివి

జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని వెంగాపురం మాజీ సర్పంచ్ కీర్తిశేషులు గులిపల్లి అప్పలనాయుడుతో ఉన్న జ్ఞాపకాలు ఎన్నడూ మరువలేనివని, ఆయన పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. వెంగాపురంలో ఏర్పాటు చేసిన అప్పలనాయుడు విగ్రహాన్ని బుధవారం జెడ్‌పి చైర్మన్‌తో పాటు పార్వతీపురం, బొబ్బిలి ఎమ్మెల్యేలు అలజంగి జోగారావు, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్‌పి చైర్మన్ మాట్లాడుతూ అప్పలనాయుడు తండ్రి అప్పలస్వామి నాయుడు కాలం నుంచి వెంగాపురంలో సర్పంచ్‌ల పరిపాలన ప్రారంభమైందన్నారు. నాటి నుంచి అప్పలనాయుడు తండ్రి అప్పలస్వామినాయుడు సర్పంచిగా పదవి నిర్వహించారు. అనంతరం ఆయన స్థానంలో కొనసాగిన అప్పలనాయుడు 18వ ఏట


అప్పలనాయుడు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్

నుంచి సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని, ఎంపిటిసిగా కొనసాగారన్నారు. ప్రస్తుతం ఆయన భార్య సర్పంచ్ గాను, కుమారుడు ఎంపిటిసి గాను కొనసాగడం శుభపరిణామమన్నారు. ఈ కుటుంబం పార్టీ విలువలకు, పార్టీ బలోపేతానికి ఎంత ప్రాధాన్యతిస్తుందో మాటల్లో చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ రాజకీయ విలువలను కాపాడుతూ ఇతరులకు మార్గదర్శక ఉంటూ గ్రామాన్ని అభివృద్ధిపథకం నడిపిన ఏకైక వ్యక్తి అప్పలనాయుడు అని కొనియాడారు. బొబ్బిలి ఎమ్మెల్యే మాట్లాడుతూ బంధుత్వంలో అండగా ఉంటూ రాజకీయంలో సలహాదారుడుగా ఉంటూ, ఇటు ప్రజలు మన్ననలను పొందుతూ వారి హృదయాల్లో చెరగని ముద్రగా అప్పలనాయుడు నిలిచారన్నారు. కార్యక్రమంలో అప్పలనాయుడు భార్య వెంగాపురం సర్పంచ్ గులిపల్లి అమ్మడమ్మ, కుమారుడు ఎంపీటీసీ మురళి గ్రామ పెద్దలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

చెరకు రైతులకు ప్రత్యేక రాయితీలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని లచ్చయ్యపేట షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో గల చెరకు రైతులకు జనవరి 24 నుంచి చెరకు సరఫరా చేసిన రైతులకు ప్రత్యేక రాయితీలు ఇస్తామని ఇఐడి పారి ఇండియా లిమిటెడ్ సంకిలి మేనేజర్ జి.అప్పారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యక్రమంలో విలేకరులతో మాట్లాడుతూ చెరకు రైతులకు జనవరి 24 నుంచి రాయితీతో పాటు మొక్కగా మమ్ము చెరకు టన్నుకు రూ.75 అదనంగా యాజమాన్యం చెల్లిస్తుందన్నారు. అలాగే మార్చి 2024 క్రస్సింగ్ సీజన్ చివరకు సరఫరా చేసిన రైతులకు మొక్క, మమ్ముకు టన్నుకు అదనంగా రూ.125 ఇస్తున్నట్టు తెలిపారు. 2022-23 సీజన్ గానూ చెరుకు ఎకరాకు రూ.7వేలు ఇస్తున్నామన్నారు. రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపి చెరుకు విస్తరణ పెంచాలని ఆయన కోరారు.

డైట్ సెట్‌కుదరఖాస్తు చేసుకోవాలి

నెల్లిమర్ల : అర్హులైన విద్యార్థులు డిఇఇ సెట్‌కి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణా సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎన్. తిరుపతి నాయుడు కోరారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ డిఇఇ సెట్ 2023 ప్రవేశానికి స్కూల్ ఎడ్యుకేషన్ ప్రకటన జారీ చేసిందన్నారు. ఈ ప్రకటన నేపథ్యంలో డిఇఇ సెట్ 2023 ప్రవేశానికి ఇంటర్ ఉత్తీర్ణులై విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సెప్టెంబర్ 1నాటికి 17సంవత్సరాలు నిండి కళాశాలలో ప్రవేశ సమయానికి బిసి, ఒసి అభ్యర్దులు ఇంటర్ మీడియట్ 50శాతం మార్కులు, ఎస్‌సి, ఎస్‌టి, వికలాంగులు 45 మార్కులతో ఉత్తీర్ణులు కావాలన్నారు. దరఖాస్తు, పరీక్ష రుసుము రూ. 750 ఈ నెల 27 లోగా ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. ప్రవేశ పరీక్ష వచ్చే నెల 12, 13తేదీల్లో జరుగుతుందని అర్హులైన అభ్యర్థులు డిఇఇ సెట్ ప్రవేశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.


ఆక్రమణలను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ హేమలత

ఆక్రమణదారులపై కఠిన చర్యలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

కోదోడుబంద ఆక్రమణలపై విచారణ జరిపి ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఎవరూ ఆక్రమణలకు పాల్పడకుండా బోర్డులు ఏర్పాటు చేయాలని పార్వతీపురం ఆర్‌డిఒ కె.హేమలత రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. పార్వతీపురం పట్టణ శివారు, వెంకంపేట ఘోరీలకు ఎదురుగా సుందర నారాయణపురం రెవెన్యూ పరిధిలోని కోదోడిబంద యథేచ్ఛగా ఆక్రమణలు కావడంతో ఇటీవల స్పందన కార్యక్రమంలో ఫిర్యాదులు వెలువెత్తాయి. స్పందించిన జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం పార్వతీపురం వైకెఎం చెక్ పోస్ట్ దరి, కోదువాని బందను ఆర్‌డిఒ రెవెన్యూ బృందంతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువులు ఆక్రమణలు జరగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఇటీవల స్పందనలో అందిన ఫిర్యాదులను ఉద్దేశించి, క్షేత్ర స్థాయిలో ఆక్రమణలకు గురికాకుండా నేమ్‌బోర్డ్‌లు ఏర్పాటు చేయించాలని, ఆక్రమణలు గుర్తిస్తే వెంటనే నోటీసులు జారీ చేసి, ఆక్రమణదారులపై తదుపరి చర్యలు తీసుకోవాలని క్షేత్ర స్థాయి సిబ్బందికి సూచించారు. ఎక్కడైనా ఆక్రమణలు గుర్తిస్తే సంబంధిత క్షేత్రస్థాయి సిబ్బందిదే పూర్తి నిర్లక్ష్యంగా పరిగణించి, వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.


విద్యార్థులకు ఆకులు, కర్రపుల్లలతో విద్యను బోధిస్తున్న సత్యం నాయుడు

ఆకులు, కర్రపుల్లలతో విద్యాబోధన

సీతంపేట : మండలంలో పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు నెల్లి సత్యం నాయుడు పాఠశాల పరిసరాల్లో లభించే లోకాస్టు నో కాస్ట్ మెటీరియల్ గల ఆకులు, పువ్వులు కర్రపుల్లలతో ఒకటవ తరగతి విద్యార్థులకు గణిత బోధన చేశారు. అలాగే ప్రతి విద్యార్థి విజ్ఞానం పెంపొందించుకోడానికి గ్రంథాలయంలో పుస్తకాలు చదవాలన్నారు. ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ చదువుపై చూపుతున్నారు.

పాలకొండ: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో మూడో రోజు తంపటాపల్లి డ్రాయింగ్ మాష్టర్ గొర్లె మురళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పిల్లలకు డ్రాయింగ్‌లో కొన్ని ముఖ్యమైన అంశాలు చెప్పారు. ప్రాణం లేని వాటిని, ప్రాణంతో ఉన్న వాటిని ఎలా గీయాలో చెప్పారు. షాడో డ్రాయింగ్ ఒక వాటర్ బాటిల్ ఎలా గీయాలో పిల్లలకు చెప్పారు. విద్యార్థిని, విద్యార్థులు 15మందికి పైగా పాల్గొన్నారు. ఇంఛార్జి గ్రంథాలయ అధికారి గణేష్ బాబు సహాయకులు ఈశ్వర్ పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

సీతానగరం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపిపి బి.రవణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఎఒ ఎస్.అవినాష్ మాట్లాడుతూ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులు ముందుగా అన్నారు. అలాగే ధాన్యానికి రైతు భరోసా కేంద్రాల్లో చేయడం జరుగుతుందన్నారు, ఎపిఎం ఆర్.శ్రీరాములు మాట్లాడుతూ మహిళలకు ఎస్సీ, ఎస్టీ పొదుపు గ్రూపులకు ఆసరా డబ్బులు జమ చేయమని బిసి గ్రూపులకు ఇంకా పడలేదని ఏడాది ప్రారంభం కావడంతో త్వరలో ఈటి డబ్బులు జమవుతాయని అన్నారు. అన్ని శాఖ అధికారులు పలు అంశాలపై తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు చేసుకోవాలి

వీరఘట్టం : మండలంలోని ప్రతి ఒక్కరు కూడా ఆధార్ నమోదు చేసుకోవాలని ఎంపిడిఒ వె. వెంకటరమణ ప్రజలను కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో 0-5ఏళ్ల వయస్సు లోపు పిల్లలు 2381 మంది ఉన్నారని, ఇంత వరకు 1365 మంది ఆధార్ నమోదు చేసుకున్నట్లు తెలిపారు. అలాగే ఆరేళ్ల నుంచి 19ఏళ్లలోపు పిల్లలు 1241 మందికి గానూ వెయ్యి మంది వరకు ఆధార్ నమోదు చేసుకున్నట్లు తెలిపారు. అలాగే 610 మంది గర్భిణీలకు గానూ 546 వరకు ఆధారు నమోదు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఆధార్ నమోదు చేసుకోవడంలో ఎవరూ నిర్లక్ష్యం చేయరాదని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.


నాగభూషణంకు ఆర్థికసాయం అందజేస్తున్న యువత

మానవత్వానికి మంచి పేరు గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం : 'ఎవరికి ఏమైతే మాకేంటి మా బాధలు మావి' అనుకునే ఈ రోజుల్లో మానవత్వం ఉందని గుమ్మలక్ష్మీపురం గ్రామం యువత నిరూపించింది. దీంట్లో గుమ్మలక్ష్మీపురం మానవత్వానికి మంచి పేరుగా నిలుస్తుంది. గుమ్మలక్ష్మీపురం కొండవీధికి చెందిన నిమ్మక నాగభూషణ్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని గుర్తించిన వీధివాసులు ఆర్థిక సహాయం చేసి ఆదుకున్నారు. ఇందులో భాగంగా స్థానికంగా ఉండే కొండవీధి పెద్దలు, స్నేహితులు రూ.11800 నగదు, బియ్యం ఇచ్చి అండగా నిలిచారు. కార్యక్రమంలో సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకర్రావు, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, మాజీ సర్పంచ్ పాలక ప్రేమానంద్, వార్డు మెంబర్లు, స్నేహితులు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ త్రినాధులు

సచివాలయాన్ని సందర్శించిన ఎంపిడిఒ

పాలకొండ రూరల్: మండలంలోని లంబూరు సచివాలయాన్ని ఎంపిడిఒ డొంక త్రినాధులు బుధవారం సందర్శించారు. సిబ్బంది హాజరు పట్టీతో పాటు ప్రభుత్వ పథకాలకు సంబంధించి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు.


మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పిఎసిఎస్ అధ్యక్షులు సీతారాం


మొక్క జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

సాలూరు: మండలంలోని శివరాంపురంలో రైతు భరోసా కేంద్రంలో మొక్క జొన్న కొనుగోలు కేంద్రాన్ని బుధవారం పిఎసిఎస్ అధ్యక్షులు సీతారాం ప్రారంభించారు. పిఎసిఎస్ ఆధ్వర్యాన మొక్క జొన్న కొనుగోలు చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఎఒ అనురాధ పండా రైతులతో సమావేశం నిర్వహించారు. కొనుకోలుకు సంబంధించిన నిబంధనలు గురించి వివరించారు. 14శాతం లోపు తేమ ఉండేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ జర్జాపు మోహన్ ఉన్నారు.

అనారోగ్యంతో విఆర్ఎ మృతి

మక్కువ : కారుణ్య నియామకం ద్వారా తండ్రి మృతి చెందడంతో వచ్చిన ఉద్యోగంలో చేరి రెండు నెలల దాటకముందే మృతి చెందడంతో ఆ కుటుంబం రోడ్డున పడినట్లు అయింది. మండలంలోని కోన పంచాయతీ పరిధిలోని గోపాలపురానికి చెందిన విఆర్ఎ ఎస్ శివ కుమార్ బుధవారం మతి చెందాడు ఇటీవల అనారోగ్యం వారిన పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. శివకుమార్ మృతితో కుటుంబం దుఃఖసాగరంలో మునిగిపోయింది. ఇటీవల కారుణ్య నియామకంలో తండ్రి ఉద్యోగాన్ని పొంది ఉన్నాడు. శివకుమార్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. శివకుమార్ మంచి వ్యక్తిగా పేరు పొందడంతో గ్రామంలో అంతా విషాదసాయలు అలముకున్నాయి.

మంచి మనసున్న మనిషి తవుడు : బొత్స


సభలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి - సాలూరురూరల్

మంచి మనసున్న మనిషి సువ్వాడ తవుడు అని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ కొనియాడారు. మండలంలోని మామిడిపల్లిలో కీర్తిశేషులు సువ్వాడ తవుడు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన అయన మాట్లాడుతూ మండలంలో సంప్రదాయక రాజకీయాలు చేసిన వ్యక్తి అని, ఈ ప్రాంత అభివృద్ధికి చాలా కృషి చేసిన నాయకుడని కొనియాడారు. గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మాణానికి స్థలం, సరస్వతి శిశుమందిర్ పాఠశాల నిర్మాణం, మంచినీటి నీళ్ల టాంక్‌లను సాలూరు నుండి మారుమూల గంగన్నదొర వలస వరకు డబుల్ రోడ్డును, నేరళ్లవలస నుంచి కుంబిమడ మధ్యలో బ్రిడ్జిను అభివృద్ధి చేశారని అన్నారు. అటువంటి నాయకుడి ఆశయాలు కొనసాగించడానికి ఆయన కుమారులు కృషి చేయాలని కోరారు. డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర మాట్లాడుతూ సువ్వాడ తవుడు లేకపోయినా ఆయన చేసిన మంచి పనుల వల్ల ఆయన మన మధ్యనే ఉంటారని అన్నారు. సెటిలర్స్ వల్ల ఈ ప్రాంతం మరో కోనసీమ అయ్యిందని, వారిపైన ఎటువంటి ద్వేషం లేదని, ఈ ప్రాంత అభివృద్ధిలో వారి పాత్ర ఎంతో ఉందని, సంప్రదాయక పంటలు పండించే ఈ ప్రాంత గిరిజనులు సెటిలర్స్ వచ్చిన తర్వాతే వాణిజ్య పంటలైన అరటి, మొక్క జొన్న, కంద, పామాయిల్, నిమ్మ, బత్తాయి, బొప్పాయి ఇలా ఎన్నో రకాల పంటలను పండిస్తూ ఇక్కడ గిరిజన రైతులు కూడా వారితో సమానంగా పంటలు పండిస్తున్నారని అన్నారు. మండలంలో ఆదివారం కొట్టుపరువులో తాను అన్న మాటలను కొన్ని మీడియా సంస్థలు తప్పుగా వక్రీకరించాయని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు తమ వంతుగా సెటిలర్స్ కూడా కృషి చేయాలన్నారు. కందుల పదం బ్రిడ్జి విషయంలో గానీ, కొట్టిపరువు రోడ్ విషయంలో గానీ బబ్లూ అనే భూస్వామి తండ్రి గిరిజనుల ఇబ్బందులను చూసి రోడ్ సౌకర్యానికి తన పొలంలో కొంత భూమిని ఇచ్చారని అన్నారు. అప్పుడు వాళ్ల నాన్న ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం రోడ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందని, దీన్ని అడ్డుకోవడం సరికాదని అన్నారు. అంతా సహరిస్తే అభివృద్ధి చేసుకోవచ్చని అన్నాను తప్ప ఇక్కడ ఉన్న సెటిలర్లందర్నీ తాను ఏమీ అనలేదని వివరణ ఇచ్చారు. మొట్ట మొదటి సారి తాను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పుడు కొంత మంది సెటిలర్లు భూములను గిరిజనులకు ఇప్పించేస్తారన్న ప్రచారం చేశారు కానీ మీ అందరి సహకారంతో నాలుగు దఫాలుగా ఎమ్మెల్యేగా ఉన్న ఎప్పుడూ సెటిలర్లను ఇబ్బంది పెట్టలేదని అన్నారు. ఇక్కడ ఉన్న వారంతా తమ మనుషులని అంతా ఒకరికొకరు సహరించుకొంటే అభివృద్ధి కార్యక్రమాలు చేసుకోగలమని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి రాములమ్మ, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, సువ్వాడ గుణవతి, మక్కువ జెడ్పీటీసీ శ్రీనివాసనాయుడు, రామభద్రపురం ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, సర్పంచ్ సువ్వాడ శశికళ, వైసిపి నాయకులు దండి శ్రీనివాసరావు, సువ్వాడ రామ కష్ణ, శ్రీనివాసరావు, ఎఎంసి చైర్‌పర్సన్ దండి అనంతకుమారి జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు రెడ్డి పద్మావతి, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

టిడిపి సమావేశానికి భంజ్‌దేవ్ డుమ్మా

ప్రజాశక్తి - సాలూరు

టిడిపి నియోజకవర్గ స్థాయి సమావేశానికి మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ డుమ్మా కొట్టారు. బుధవారం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి జి.సంధ్యారాణి నివాసంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల శిక్షణా సమావేశంలో భంజ్ దేవ్ కనిపించలేదు. ఆయన స్థానికంగా ఉన్నప్పటికీ సమావేశానికి హాజరు కాకపోవడం చర్చనీయాంశమైంది. గతంలో సమన్వయ కమిటీ సమావేశమని పిలిచి పాచిపెంట మండల అధ్యక్షుడ్ని మార్చడంపై భంజ్‌దేవ్ తీవ్ర అసంతప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. పాచిపెంట మాజీ ఎంపిపి పిన్నింటి ప్రసాద్ బాబు, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ పిన్నింటి ఈశ్వరరావు, మక్కువ మండల మాజీ ఎంపిపి పెంట తిరుపతిరావు కూడా సమావేశం హాజరు కాలేదు. వీరితోపాటు వీరి అనుచరులు హాజరు కాకపోవడంతో సమావేశం నియోజకవర్గ ఇన్చార్జి సంధ్యారాణి అనుచరులతోనే జరిగినట్లు కనిపించింది. వాస్తవంగా ఈ సమావేశంలో బూత్, గ్రామ స్థాయి కమిటీ సభ్యులకు శిక్షణ నిర్వహించాల్సి ఉంది. కానీ నాలుగు మండలాలతో పాటు మున్సిపాలిటీ నుంచి కూడా భంజ్‌దేవ్ అనుచరులెవరూ హాజరు కాకపోవడంతో హాజరైన వారిలో కొంత నైరాశ్యం కనిపించింది.


కాలువల్లో పేరుకుపోయిన చెత్త

కాలువల పరిస్థితి ఇలా... మురుగునీరు పోయేదెలా?

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలోని పలు వార్డుల్లో మురుగు కాలువల పరిస్థితి పరమ అధ్వానంగా ఉందని, కాలువల పరిస్థితి ఇలా ఉంటే కాలువల్లో చేరే వాడుక నీరు, మురుగు నీరు పోయే మార్గం పరిస్థితి ఏమిటని ఆయా వార్డుల ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. పలు వార్డుల్లో ఉన్న కాలువలను కప్పి భవన నిర్మాణ యజమానులు నిర్మాణ మెటీరియల్‌లను వేయడం వల్ల కాలువల్లో మురుగు నీరు నిలిచిపోతుందని, వీటిని ఆయా వార్డుల స్థానిక కౌన్సిలర్లు గానీ, సంబంధిత సచివాలయ శానిటరీ కార్యదర్శులుగానీ విధి నిర్వహణను పర్యవేక్షించే మున్సిపల్ ప్రజారోగ్య అధికారులు గానీ పట్టించుకోవడం లేదని ఆయా వార్డులలో ఉన్న ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నప్పటికీ వారి పర్యవేక్షణ కొరవడడంతో మున్సిపల్ పరిధిలో పారిశుధ్య నిర్వహణలో ఏ మాత్రం మార్పు రాలేదని, ఈ పరిస్థితిని పర్యవేక్షణ చేసి పట్టణంలో పలు పారిశుధ్య నిర్వహణను సక్రమంగా అమలు చేయాలని పలువురు కోరుతున్నారు.

కరెంట్ కోతతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి

ప్రజాశక్తి - కురుపాం

అసలే వేసవి, ఆపై విద్యుత్ ప్రజలకు ఎంతో అవసరమైనప్పటికీ రాత్రి సమయంలో విద్యుత్ లేక గత రెండు రోజులుగా కురుపాం పరిసర ప్రాంత ప్రజలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. గత రెండు రోజులుగా ఎండలు తీవ్రత ఎక్కువగా ఉండి 38 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రత నమోదు కావడంతో వేడిని తట్టుకోలేక చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓ పక్క కరెంటు పోతే మరోపక్క దోమల బెడద తట్టుకోలేక ఉక్కిరి బిక్కిరి అవుతున్నామని, రాత్రి సమయంలో సుమారు 10 గంటల నుంచి ఒంటి గంట వరకు కరెంటు రాకపోవడంతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పగల అయితే చెట్లు, చేమల కింద ఉండైనా విశ్రాంతి తీసుకుంటామని, అలాంటిది రాత్రి సమయంలో కరెంటు కోతతో అవస్తలు పడుతున్నామని తెలిపారు. గత రెండు రోజులుగా వేడి దాటికి ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి రాత్రి సమయంలో ప్రజలకు సక్రమంగా కరెంటు అందజేసి వేడి దాటి నుంచి ఉపశమనం కలిగేలా చూడాలని కోరుతున్నారు.


కురుపాం : విద్యుత్‌కోతతో రోడ్డుపై ఉన్న యువత

మొరాయించిన ట్రాన్స్ఫార్మర్లు... అంధకారంలో జనాలు

వీరఘట్టం : మండల కేంద్రంలోని ఈనెల 1 నుంచి 10వరకు ఎంతో అట్టాసంగా నిర్వహించిన పైడితల్లి అమ్మవారి గ్రామదేవత మహోత్సవ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈనెల 9న సిరిమానోత్సవం కార్యక్రమం ముగియగానే మండల కేంద్రంలోని తెలగ, బిసి కాలనీ, గేంబల వీధులకు సంబంధించి విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు మొరాయించాయి. దీంతో జనవాసులు అంధకారంలో గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు భానుడు తన ప్రతాపాన్ని, ఎండ వేడిమి తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోయారు. సిరిమానోత్సవం కార్యక్రమం రాత్రి 9గంటల తర్వాత విద్యుత్ సరఫరా చేయడంతో ఒక్కసారిగా లోడు పడి వీటి ప్రభావం అక్కడక్కడ ట్రాన్స్‌ఫార్మర్లు ఫేజులు కొట్టినప్పటికీ సిబ్బంది అనునిత్యం పర్యవేక్షించి మరమ్మతులు చేపట్టారు. చివరకు పై వీధిల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు పూర్తిస్థాయిలో మరమ్మతులకు గురవ్వడంతో స్థానిక, ఇతర ప్రాంతాల నుంచి గ్రామదేవత పండక్కి వచ్చిన ప్రజానీకానికి అవస్థలు తప్పలేదు. రక్షిత మంచినీటి సరఫరా పూర్తిస్థాయిలో అందించలేకపోవడంతో గుక్కడి నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మళ్లీ మధ్యాహ్నం, సాయంత్రం పథకం ద్వారా తాగునీరు సరఫరా చేసినప్పటికీ గొంతును కూడా తడపలేక వీధులు అనుసరించిన తాగునీటి బోర్లపై ఆధారపడి గొంతులు తడుపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

విద్యుత్ కోతలు లేకుండా చూడాలి

పార్వతీపురం టౌన్ : మండువేసవి, ఉక్కబోత సమయంలో అర్ధరాత్రి విద్యుత్ కోత విధిస్తే కార్యాలయానికి మంచాలతో వచ్చి పడుకుంటామని, విద్యుత్ కోతలు లేకుండా చూడాలని జనసేన నాయకులు విద్యుత్ శాఖ అధికారులను హెచ్చరించారు. బుధవారం జనసేన జిల్లా నాయకులు విద్యుత్ శాఖ ఎఇ రామారావుతో విద్యుత్ కోతలు, ప్రజల ఇబ్బందులపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓపక్క మండువేసవి, ఎండలు మండుతూ ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న తరుణంలో ఉక్కబోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారని, ఈ సమయంలో అర్ధరాత్రి కరెంటు కోతలు విధించడం సబబుకాదన్నారు. మంగళవారం రాత్రి విధించిన అప్రకటిత కరెంటు కోతకు జిల్లా ప్రజలు నరకం చూశారన్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రం పార్వతీపురం పట్టణంలో వృద్ధులు, చిన్న పిల్లలు, గర్భిణీ స్త్రీల అవస్థలు వర్ణనాతీతమని. వేసవి సందర్భంగా ముందస్తు ఏర్పాట్లు చేసుకొని కరెంటు కోతలు లేకుండా చూడాలని, మంగళవారం రాత్రి లాగే మళ్లీ కరెంటు కోతలు పునరావృతం అయితే కార్యాలయానికి మంచాలు తెచ్చి పడుకుంటామని హెచ్చరించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చందక అనిల్ కుమార్, వంగల దాలినాయుడు, రాజాన రాంబాబు, నెయ్యిగాపుల సురేష్ కుమార్, అన్నా బత్తుల దుర్గాప్రసాద్, సీతానగరం మండల అధ్యక్షులు పాటి శ్రీనివాసరావు, మండల ప్రసాద్, సాయి జనసైనికులు పాల్గొన్నారు..

సామాజిక న్యాయం దిశగా చర్యలు

సలహాదారు జూపూడి ప్రభాకర్

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

ప్రజల సంక్షేమమే నిరంతర అభివృద్ధికి అసలైన నిర్వచనం అని రాష్ట్ర ఎస్‌సి సెల్ అధ్యక్షుడు, రాష్ట్ర ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం జిల్లాకు విచ్చేసిన ఆయన స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. ఎస్‌సి, ఎస్‌టిలకు సముచిత స్థానం కల్పిస్తూ రాష్ట్ర ప్రభు త్వం ఎన్నో బృహత్తర కార్యక్రమాలు చేపట్టిందని, దానిలో భాగంగానే విద్య, వైద్య రంగంలో అనేక సేవలు అందిస్తోందని పేర్కొన్నారు. అంబేద్కర్ రాజ్యాంగంలో పేర్కొన్న అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని గుర్తు చేశారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే ఆంధ్రప్రదేశ్ లోనే అన్ని వర్గాల వారికి, ముఖ్యంగా దళితులకు న్యాయం జరిగిందని తెలిపారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా 1.40కోట్ల మందికి లబ్ధి చేకూరిం దని గుర్తుచేశారు. రాష్ట్రంలో కూడా దళిత బంధు పథకం ప్రవేశపెట్టే యోచన ఉందని విలేకర్లు అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. భూములు కొనుగోలు విధానాన్ని పునరుద్ధరించను న్నామని మరొక ప్రశ్నకు సమాధానం చెప్పారు. సమావేశంలో రాష్ట్ర ఎస్‌సి సెల్ ప్రతినిధులు రాజబాబు, వెంకట రావు, శ్రీనివాసరావు, వైసిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ అధ్యక్షుడు జై హింద్ కుమార్ పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు విత్తనాలు సిద్ధం

బొబ్బిలి : ఖరీఫ్‌కు సంబంధించి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయశాఖ ఎడి ఎం.శ్యామసుందర్‌రావు అన్నారు. బొబ్బిలిలో స్టాక్ పాయింట్‌ను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలు, జీలుగా కట్టెలు, పిల్లి పెసర వంటి విత్తనాలు సంసిద్ధం చేశామన్నారు. మండలానికి సంబంధించి 500 క్వింటాళ్లు జీలుగా, 400 క్వింటాళ్లు కట్టే జనుము, 100 క్వింటాళ్లు పిల్లి పెసర, సిద్ధం చేశామన్నారు. వీటి ధరలు 50 శాతం రాయితీ పోను 10 కేజీల జీలుగా రూ.395, 10 కేజీల కట్టే జనుము రూ. 420, 8 కేజీల పిల్లి పెసర రూ.38 చెల్లించి రైతులు రైతు భరోసా కేంద్రాల వద్ద కొనుగోలు చేసుకోవచ్చునన్నారు. ఈ పచ్చిరొట్ట విత్తనాలు సోమవారం నుండి రైతు భరోసా కేంద్రాల్లో సరఫరా చేస్తున్నామన్నారు.

రామతీర్థం హుండీ లెక్కింపు

నెల్లిమర్ల: రామతీర్థం రామస్వామి ఆలయానికి చెందిన హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ ఏడాది ఫిబ్రవరి 20 నుంచి మే 20 వరకూ వచ్చిన హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ. 24.64 లక్షలు ఆదాయం వచ్చిందని ఆలయ సహయ కమిషనర్ డివివి ప్రసాద రావు తెలిపారు.

సీతంపేటలో తాగునీటి సరఫరా పునరుద్ధరణ

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్



మండలంలోని సంగంవలస పంచాయతీ సీతంపేటలో రక్షిత మంచినీటి పథకం మోటారు కాలిపోవడం, అనంతరం బోరు మరమ్మతులకు గురవ్వడంతో నీటిసరఫరాకు జరిగిన అంతరాన్ని సరిచేసినట్లు సర్పంచ్ చిట్టినాయుడు, ఉప సర్పంచ్ శ్రీరంజన్ తెలిపారు. తాగునీరు సరఫరా జరగడంలేదని, గ్రామానికి చెందిన మహిళలు మంగళవారం సంగంవలసలో ఖాళీ బిందెలతో ర్యాలీ నిర్వహించగా, స్పందించిన సర్పంచ్ హుటాహుటిన కొత్త సబ్‌మెర్సిబుల్ పంపును అమర్చడంతో పాటు, గ్రామంలోని బోరు బావులకు మరమ్మతులు చేయడంతో సమస్య పరిష్కారమైంది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సమస్యను తమదగ్గరకు తీసుకురాకుండా కొందరు రాజకీయ ప్రలోభాల కోసం అమాయకులైన గ్రామస్తులను రెచ్చగొట్టడంతో సమస్య తలెత్తిందని, ఏదేమైనప్పటికీ గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు పునరుద్దరించామని తెలిపారు.

'నభూతో నా భవిష్యతి' నినాదంతో ముందుకెళ్లాలి

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం


టిడిపి కార్యకర్తలు నభూతో నా భవిష్యతి అనే నినాదంతో ముందుకు వెళ్లాలని టిడిపి కురుపాం నియోజకవర్గ ఇన్చార్జి తోయక జగదీశ్వరి అన్నారు. బుధవారం ఆమె గుమ్మలక్ష్మీపురం మండలం, క్లస్టర్ నెంబర్ 3లో 23 మంది బూత్ ఇన్‌ఛార్జీల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. భవిష్యత్తులో ప్రతి బూత్ ఇన్‌ఛార్జి తమ పరిధిలో ఉన్న కొత్త ఓటర్లను చేర్పించడం, అలాగే ప్రభుత్వం డిలీట్ చేసిన ఓటర్లను ఒక్కసారి సరి చూసుకోవడం ప్రతిరోజు చేయాలన్నారు. రాబోయే రోజులలో ఏ బూతులో అయితే ఎక్కువ ఓట్లు తెలుగుదేశంకి వస్తాయో ఆ బూత్ ఇన్‌ఛార్జులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కాబట్టి రాబోయే రోజుల్లో టిడిపి కార్యకర్తలు గట్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ ఆర్గనైజర్ పోలూరు శ్రీనివాసరావు, టిడిపి కార్యకర్తలు ఆరిక నరేష్, కిల్లక దాసు, తదితరులు పాల్గొన్నారు.


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జగదీశ్వరి

'నా భూమి ఇప్పించండి'

ప్రజాశక్తి - పార్వతీపురం

నా భూమిని నాకు ఇప్పించాలని రేపటివలస గ్రామానికి చెందిన జన్ని సింహాచలం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను కోరారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ను కలిసి ఆర్జీ సమర్పించాలని సింహాచలం తన భర్త శ్రీరాములుదొరతో కలిసి వచ్చారు. జిల్లా కలెక్టర్ ఒక సమావేశంలో ఉండగా సింహాచలం వేచి చూస్తుండగా, జిల్లా కలెక్టర్ సమావేశం ముగిసిన అనంతరం నేరుగా ఆమె వద్దకు వెళ్లి వచ్చిన పనిని అడిగి తెలుసుకున్నారు. అటవీ హక్కుల చట్టం కింద భూమిని కేటాయించగా, జీడి తోట వేసి సాగు చేస్తున్నామని, అయితే యండ్రాపు బలరాం, మన్నింగి రాము అనే వ్యక్తులు బలవంతంగా భూమిని ఆక్రమించేందుకు చూస్తున్నారని వివరించారు. గత రెండేళ్లుగా ఫలసాయాన్ని తీసుకుంటున్నారని తెలిపారు. నా భూమిని ఇప్పించి న్యాయం చేయాలని ఆర్జీని జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. జగనన్నకు చెబుదాం వెబ్ సైట్‌లో ఆర్జీని నమోదు చేసి చర్యలు తీసుకోవాలని పరిపాలన అధికారి ఉమామహేశ్వర రావును ఆదేశించారు.


కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న బాధితులు

నేరాలు ఘోరాలు

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. సంఘటకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా మెంటాడ మండలం కొండమామిడివలసకు చెందిన బోయిన మురళి, గుమ్మడి సోములు పార్వతీపురం మండలం బందలుప్పి పంచాయతీ నిమ్మవానివలసలో జరుతున్న తమ స్నేహితుడి పెళ్లికి వెళ్తుండగా, పుట్టూరుపంచాయితీ దిబ్బగుడివలస మలుపు దగ్గర ద్విచక్రవాహనం అదుపుతప్పి విద్యుత్ స్థంభాన్ని ఢీకొన్నారు. ఈ సంఘటనలోనూ ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మురళి(26) మృతి చెందాడు. అతనితో పాటు ప్రయాణిస్తున్న రెడ్డివానివలసకు గుమ్మడి సోములు (32)కు తలకు తీవ్ర గాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ఆయన చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. ఔట్‌పోస్టుపోలీసులు వివరాలు నమోదు చేశారు.



మృతులు సోములు, మురళి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని యు. వెంకంపేట పరిధి, గిరి జంక్షన్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ధనుకోటి జోగినాయుడు (43) మృతి చెందగా, పైడ్రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జి.శిగడాం మండలం బాతువ గ్రామానికి చెందిన ధనుకోటి జోగినాయుడు అతని బావ పైడిరాజు బుధవారం బాతువ నుంచి ద్విచక్ర వాహనంపై వీరఘట్టంలో జరిగే పైడితల్లి అమ్మవారి గ్రామ దేవత పండక్కి వస్తుండగా పాలకొండ వైపు వెళు తున్న ఆటో మరియగిరి జంక్షన్ వద్ద ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నాయి. ఈ సంఘటనలో జోగినాయుడు, పైడ్రాజు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో జోగినాయుడు మృతి చెందాడు. పైడిరాజు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి భార్య భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.